సాక్షి
మహబూబాబాద్
గురువారం । 12 । అక్టోబర్ । 2023



వాహన తనిఖీలు ముమ్మరం..
ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు, సిబ్బందితో కలిసి చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. - 10లో▸



ముగిసిన కేయూ పాలకమండలి కాలపరిమితి!
కేయూ పాలకమండలి కాలపరిమితి బుధవారంతో ముగిసినట్లు సమాచారం. - 10లో▸

గరిష్టం/కనిష్టం
38.7^0 /29.3^0
వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఉంటుంది.

యువతపై దృష్టి

డోర్నకల్‌లో 25శాతం, మహబూబాబాద్‌లో 21శాతం యువ ఓటర్లు

- గెలుపోటములను శాసించే స్థితి
- వారిని ఆకర్షించేందుకు నాయకుల ప్రణాళికలు
- కుట్టు మిషన్ శిక్షణ, ఉద్యోగ మేళాలు

జంగ్ తెలంగాణ



సాక్షి, మహబూబాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో యువ ఓటర్లు కీలకం కానున్నారు. ఎప్పటి మాదిరిగానే గెలుపోటములను ప్రభావితం చేయనున్న నేపథ్యంలో.. అన్ని పార్టీలు వారిపై దృష్టి పెట్టాయి. యువతను ఆకర్షించే విధంగా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాయి. ఈ మేరకు పార్టీల నాయకులు రకరకాల తాయిలాలు సిద్ధం చేస్తున్నారు. మరికొందరు వివిధ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించి యవతను మచ్చిక చేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఆకర్షించేలా..
యువతను ఆకర్షించుకునేందుకు నాయకలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అధికార పార్టీ నాయకులు ఇప్పటికే పలు కార్యక్రమాలు నిర్వహించి యువతకు దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగానే మహబూబాబాద్, పాలకుర్తి నియోజకవర్గాల్లో క్రీడా కిట్లు అందజేశారు. క్రీడోత్సవాలు నిర్వహించారు. నిరుద్యోగుల కోసం ఉద్యోగ మేళాలు నిర్వహించడం, కుట్టు మిషన్ శిక్షణ, కుట్టు మిషన్లు అందజేయడం, అర్హులైన వారికి డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా విపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న నాయకులు కూడా వారి వారి నియోజకవర్గాల్లో విద్యార్థులకు బస్‌పాస్‌లు ఇప్పించే కార్యక్రమాల నిర్వహించారు. అలాగే ఎన్నికల్లో యువతను ప్రత్యేకంగా ఆకర్షించేలా నాయకుల ఫొటోలు ముద్రించిన టీషర్టులు అందించడానికి సైతం కసరత్తు చేస్తున్నారు. దీంతో పాటు నామినేషన్ వేసిన నాటి నుంచి ఎన్నికలు ముగిసేవరకు యూత్ ఫాలోయింగ్ పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గస్థాయి వరకు యువతను సమీకరించేందుకు ఉత్సాహవంతులైన యువతను ఇప్పటి నుంచే చేరదీస్తున్నారు. దీంతోపాటు సోషల్ మీడియా ద్వారా తమ పార్టీ ప్రచారం, ఎదుటి పార్టీలపై విమర్శలు చేసే వీడియోలు చేసి యూట్యూబ్, వాట్సాప్, టెలిగ్రామ్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్ ద్వారా వైరల్ చేసేలా ప్రత్యేక శిక్షణ పొందిన యువతను చేరదీస్తున్నారు. వారిలో కొందరికి ప్యాకేజీలు కూడా ఇచ్చేవిధంగా అంగీకారం కుదుర్చుకుంటున్నట్లు ప్రచారం.

20 శాతానికి పైగా
జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలతో పాటు ములుగు, పాలకుర్తి, బయ్యారం నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లో యువత ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. 18నుంచి 30 సంవత్సరాల లోపు వయసు వారు 20శాతానికి పైగా ఉన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో మొత్తం 2,14,154 ఓటర్లు ఉండగా.. 18 నుంచి30 సంవత్సరాల మధ్య ఓటర్లు 55,181మందితో 25శాతం ఉన్నారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,45,765 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 51,333 మంది 18నుంచి 30 సంవత్సరాల వయసు వారు ఉన్నారు. అదేవిధంగా ప్రతీ ఎన్నికల్లో 80నుంచి 85శాతం మేరకు పోలింగ్ కాగా ఇందులో యువత ఓటింగ్ శాతం మిగిలిన ఓటర్ల కంటే ఎక్కువగా ఉంటోంది. ఈమేరకు యువతకు దగ్గరయ్యే విధంగా అన్ని పార్టీల నాయకులు కార్యాచరణ మొదలుపెట్టారు.

చీరను చూపిస్తున్న రాశీఖన్నా, పక్కన సీఎంఆర్ చైర్మన్ వెంకటరమణ, ఎండీ మోహన్ బాలాజీ





అందాల రాశి

సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో సందడి

హనుమకొండ నయీంనగర్‌లో బుధవారం వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా సినీ హీరోయిన్ రాశీఖన్నా సందడి చేశారు. ఆమెను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. మాల్‌లో ఆమె పలు చీరలు ధరించి ముచ్చటపడ్డారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ రిబ్బన్ కట్‌చేసి షాపింగ్‌మాల్‌ను ప్రారంభించారు. - 10లో▸

కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తాం


ఢిల్లీలో మధుయాష్కీతో రంగన్నగౌడ్

కురవి: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తామని ఎన్‌సీడబ్ల్యూసీ జిల్లా అధ్యక్షుడు రంగన్నగౌడ్ బుధవారం అన్నారు. ఎన్‌సీడబ్ల్యూసీ అనుబంధ కమిటీల సమావేశం ఢిల్లీలో జరుగగా బుధవారం ఆయన వెళ్లినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉందని, మంచి అభ్యర్థికి టికెట్ ఇస్తే గెలుపు ఖాయమని ఢిల్లీలో నాయకులను కలిసి వినతిపత్రం అందజేసినట్లు వివరించారు. మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్, మాణిక్యం ఠాగూర్, వంశీచందర్, కొప్పుల రాజు, మధుయాష్కీగౌడ్, ఎన్‌సీడబ్ల్యూసీ రాష్ట్ర అధ్యక్షుడు కట్యూరి సందీప్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

'మిషన్ ఇంద్రధనుష్'ను విజయవంతం చేయాలి



మహబూబాబాద్ రూరల్: మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ అంబరీష అన్నారు. కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రెడ్యాల సబ్ సెంటర్‌లో బుధవారం నేషనల్ టీం సభ్యులు తనిఖీ చేశారు. డీఎంహెచ్‌ఓ అంబరీష, నేషనల్ మెయింటనెన్స్ ఆఫీసర్ అరుణ్ కుమార్, డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ ప్రశాంత్, స్టేట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డేవిడ్ తదితరులు సంబంధిత సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగారు. వ్యాధి నిరోధక టీకాలు వేసుకోని వారికి వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఐఓ రాజ్‌కుమార్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సుధీర్‌నాయక్, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, హెచ్‌ఈఓ రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎంఏ నూతన కమిటీ

నెహ్రూసెంటర్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ బానోత్ నెహ్రూనాయక్, కార్యదర్శిగా డాక్టర్ ఎస్.సురేందర్, కోశాధికారిగా డాక్టర్ టి.వైదేహి ఎన్నిక కాగా.. ఎన్నికల అధికారిగా డాక్టర్ రూప్‌లాల్ వ్యవహరించారు.

ఎంపీడీఓ కార్యాలయంలో జీపీ నిధులు స్వాహా?

నెల్లికుదురు: ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామ పంచాయతీ నిధులు స్వహా అంటూ సోషల్ మీడియాలో ఓ పోస్టు బుధవారం చక్కర్లు కొట్టింది. అయితే నిధులు స్వాహా చేసినట్లు సోషల్ మీడియాలో వచ్చిన వార్తలపై ఎంపీడీఓ శేశాద్రిని వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి ఏమైనా సమాచారం ఉంటే తెలియజేస్తామన్నారు.

ఎండు గంజాయి పట్టివేత



కురవి: సీరోలు మండలం కాంపల్లి శివారు సక్రాంనాయక్ తండాక్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా తరలిస్తున్న కిలో ఎండు గంజాయిని పట్టుకున్నట్లు సీరోలు ఎస్సై రమాదేవి బుధవారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామం వైపు పెట్రోలింగ్ చేస్తున్నట్లు తెలిపారు. సక్రాంనాయక్‌తండా క్రాస్‌రోడ్డు వద్ద అదే తండాకు చెందిన లకావత్ వీరన్న, బానోత్ పంతులు ఎండు గంజాయిని మహబూబాబాద్‌లో విక్రయించేందుకు అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని వివరించారు. గంజాయి విలువ రూ.29,750 ఉంటుందన్నారు. గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆమె వివరించారు.

బాలికలు ఆదర్శంగా నిలవాలి



మహబూబాబాద్ అర్బన్: బాలికలు చదువులో రాణిస్తూ ఆదర్శంగా నిలవాలని జెడ్పీ సీఈఓ రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలకు అనుగుణంగా విద్యార్థులు చదువుకోవాలన్నారు. ఉన్నతస్థాయిలో ఉండేలా లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకుపోవాలన్నారు. షీటీం ఎస్సై సునంద మాట్లాడుతూ.. బాలికలు, మహిళల రక్షణ కోసం షీటీం కృషి చేస్తుందన్నారు. డీఐఈఓ సత్యనారాయణ, డీఈఓ రామారావు, డిప్యూటీ సీఈఓ నర్మద, డీడబ్ల్యూఓ వరలక్ష్మి, ప్రిన్సిపాల్ సదానందం, సీడీపీఓ డెబోరా పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా అశోక్‌కుమార్

కాశిబుగ్గ: వరంగల్‌లోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యకళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.అశోక్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న విజయగణేశ్వర్‌రెడ్డి హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు.

ఎన్నికల బదిలీ

- ఎస్పీ చంద్రమోహన్ ట్రాన్స్‌ఫర్
- 42 రోజులకే స్థానచలనం


ఎస్పీ చంద్రమోహన్

మహబూబాబాద్ రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎస్పీ జి.చంద్రమోహన్‌పై బదిలీ వేటుపడింది. గత ఆగస్టు 29న మానుకోట ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన.. ఎన్నికల సంఘం తీసుక్ను నిర్ణయంలో భాగంగా 42 రోజులకే జిల్లాను వీడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజకీయ పక్షాలకు అనుకూలంగా ఉంటున్నారనే నెపంతో రాష్ట్ర వ్యాప్తంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై కేంద్ర ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేసింది. దీనిలో భాగంగా జిల్లా ఎస్పీ చంద్రమోహన్ బదిలీ అయ్యారు. కాగా ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు అధికార బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో ఆమె కాంగ్రెస్ గూటికి చేరుతుందనే కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో పని చేసిన ఆమె అల్లుడు ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ను రాష్ట్ర పోలీస్ అకాడమీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో వచ్చిన ఎస్పీ చంద్రమోహన్ అధికార పార్టీకి అనుకూలంగా ఉంటారేమోననే కోణంలో కేంద్ర ఎన్నికల కమిషన్ బదిలీ చేసినట్లు సమాచారం. కాగా జిల్లా అడిషనల్ ఎస్పీ చెన్నయ్యకు ఇన్‌చార్జ్ ఎస్పీగా బాధ్యతలు అప్పగించారు.

నిబంధనలు పాటించాలి

- ఎస్పీ చంద్రమోహన్

మహబూబాబాద్ రూరల్: ప్రజలు ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్పీ జి.చంద్రమోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్, పరిసరాలను బుధవారం పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండం వల్ల అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లా పరిధిలో 11 చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నగదు, మద్యం రవాణా అయ్యే అవకాశాలు ఉన్నందు వల్ల పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, బస్సులు, ఆటోలు ఇలా అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి ప్రజలకు వివరిస్తున్నామన్నారు. నగదు, బంగారం ఇలా ఎలాంటి విలువైన వస్తువులు అయినా సరే సంబంధిత ధ్రువపత్రాలు లేకుండా రవాణా చేయవద్దని సూచించారు. తనిఖీల్లో డీఎస్పీ సత్యనారాయణ, టౌన్ సీఐ సతీష్, ఎస్సైలు విజయరాం కుమార్, రామారావు, తాహెర్ బాబా, దీపికరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్పీ చంద్రమోహన్

ఇంకా 50 రోజులు...

ఎన్నికల ప్రచారం, వ్యయంపై అభ్యర్థుల బెంబేలు

- ఇప్పటికే 60 రోజులుగా జనంలో అధికార పార్టీ నేతలు
- నేడో రేపో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా
- ముందస్తు ప్రచారం.. అయ్యే ఖర్చుతో వేగలేకపోతున్న అభ్యర్థులు



సాక్షిప్రతినిధి, వరంగల్: బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఆగస్టు 21న ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించారు. ఆ మరుసటి రోజు నుంచే చాలా నియోజకవర్గాల్లో పార్టీ అగ్రనేతలు, మంత్రుల 'ప్రగతి నివేదన' సభలు మొదలయ్యాయి. చాలామంది అభ్యర్థులు ప్రచారాల్లో మునిగి తేలుతున్నారు. ఇప్పటికే ఒక దఫా నియోజకవర్గంలో కలియదిరిగారు. ప్రజల ఆశీర్వాదాలు పొందేందుకు ప్రచారం సాగిస్తున్నారు. మరోవైపు బీజేపీ, కాంగ్రెస్ తదితర పార్టీలనుంచి పోటీలో నిలిచే ప్రత్యర్థులెవరో ఇంకా తేలలేదు. గతంలోలాగా ఏమైనా కూటములు పుట్టుకొస్తాయా? సాధారణంగా బీజేపీ, కాంగ్రెస్‌లతోనే పోటీ ఉంటుందా? అన్నది కూడా ప్రశ్నే. పోలింగ్ తేదీకి సరిగ్గా నెల ముందు ప్రచారం మొదలుపెట్టొచ్చని ఆయా పార్టీల అధిష్టానాలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. అయినా ఆశావహులు క్షేత్రస్థాయిలో విస్తృతంగానే తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ అభ్యర్థులతోపాటు ఆయా పార్టీల ఆశావహులందరూ ఈసారి ఎన్నికల ఖర్చు తడిసిపోతుండడంతో బెంబేలెత్తుతున్నారు.

తడిసిమోపెడవుతున్న ఖర్చు...
2014, 2018 ఎన్నికల్లోనూ తెలంగాణ సెంటిమెంటే ప్రచారాస్త్రంగా బీఆర్ఎస్ అభ్యర్థులు బరిలో నిలిచారు. 2014తో పోలిస్తే 2018లో ఖర్చు పెరిగినా ఈసారంత టెన్షన్ పడలేదని కొందరు అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు. ఈసారి కూడా మరీ ముందస్తుగా అభ్యర్థిత్వాలు ఖరారు కావడంతో ఇటు ఆనందంతో ప్రచారం చేయాలా? లేదా తడిసి మోపెడవుతున్న ఖర్చులు చూసి జడుసుకోవాలా? తెలియని పరిస్థితి నెలకొంది. ఎన్నికల సంఘం ఒక్కో అభ్యర్థి రూ.40 లక్షల వరకు మాత్రమే వెచ్చించాలని నిబంధనలు విధించింది. ఆ మొత్తంతో ప్రచారం పూర్తయ్యే అవకాశం లేదు. ప్రచారంలో భారీ సంఖ్యలో కార్యకర్తలను వెంటబెట్టుకోవాలి. ర్యాలీలు తీయాలంటే వేలాది బైక్‌లలో పెట్రోలు నింపాలి. ఇలా బోలెడు ఖర్చులు ఉంటాయి. వాటన్నింటినీ తట్టుకోవడం మామూలు విషయం కాదు. పైగా జీఎస్టీ అమలుతో అన్ని ధరలు ఆకాశాన్నంటేలా ఉన్నాయి. ధరల ప్రభావం అభ్యర్థులకు పెనుభారంగా మారింది. ఉమ్మడి జిల్లాలో 12 శాసనసభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. కాగా కాంగ్రెస్, బీజేపీలు ఇంకా ప్రకటించలేదు. తొలి జాబితా రేపోమాపో వస్తుందని అంటున్నారు. కొందరు కాంగ్రెస్ నేతలు తమకు టికెట్ వస్తుందని ప్రచారం చేస్తున్నారు.

ఇటువైపు చల్లారలేదు.. అటువైపు పొంచేఉంది..
బీఆర్ఎస్ అభ్యర్థులు ఖరారైన స్థానాల్లో అసంతృప్తులు చల్లబడినట్లు కనిపిస్తున్నా.. చాలాచోట్ల చాపకింది నీరులా విస్తరిస్తోంది. ఇన్నాళ్లూ తమను పట్టించుకోకపోవడం, కొన్ని చోట్ల సిట్టింగులకే టికెట్లివ్వడం, మరికొన్ని చోట్ల మార్చడం లాంటి కారణాలు చూపుతూ రెండో స్థాయి కేడర్ రగులుతోంది. అధిష్టానం.. నాయకుల మధ్య రాజీ కుదిర్చినా.. తనకు మద్దతుగా ఉండాలని కోరుతున్న బీఆర్ఎస్ కొత్త అభ్యర్థులు కొందరు మండల స్థాయి నాయకుల మధ్య ఇంకా పొసగడం లేదు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుంటున్న అధిష్టానం నిఘా వర్గాలతో కొన్ని నియోజకవర్గాల్లో మండలాల వారీగా అసంతృప్తుల జాబితా తయారు చేస్తున్నట్లు సమాచారం. జాబితా అందిన తర్వాత వారిని పిలిచి మాట్లాడటమా? లేదంటే స్వయంగా వెళ్లి కలవడమా అన్న దానిపైనా అభ్యర్థులకు త్వరలోనే నాయకత్వం సూచనలు చేసే అవకాశం ఉందని పార్టీవర్గాల సమాచారం. ఇదిలా ఉంటే ఇంకా అభ్యర్థులు ఖరారు కాని బీజేపీ, కాంగ్రెస్ ఆశావహులు భయం భయంగానే ఉన్నారు. రెండు మూడు రోజుల్లో అభ్యర్థులు సైతం ఖరారు అయ్యే అవకాశాలు ఉండడంతో ఆశపడి భంగపడ్డ నేతలను ఎలా శాంతింపజేయడమన్న చర్చ ఆ రెండు పార్టీల్లో సాగుతోంది. ఇప్పుడు నిర్లక్ష్యం చేస్తే ఇతర పార్టీల వైపు మొగ్గు చూపే ప్రమాదముందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. అభ్యర్థుల ప్రకటన తర్వాత ఎవరూ అసంతృప్తికి గురికాకుండా ఉండేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఆశావహులు అధిష్టానాలను కోరుతున్నారు.

ఈవీఎం గోదాంల వద్ద నిఘా పెంచాలి

- కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: ఈవీఎం గోదాంల వద్ద నిఘా పెంచాలని, వీడియో రికార్డింగ్‌లను తప్పనిసరిగా భద్రపర్చాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు.జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి కలెక్టర్ శశాంక తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూం, గోదాం సీలింగ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గోదాం సిబ్బంది నిబంధనల ప్రకారం అన్ని నమోదు చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అలివేలు, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఎలక్షన్ సూపరిటెండెంట్ పవన్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సందేహాలను నివృత్తి చేసుకోవాలి
జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలిని, ఎలాంటి సందేహాలు ఉన్నా వెంటనే నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ఎన్నికల ప్రవర్తనా నియమావళితో పాటు పలు విషయాలపై కలెక్టర్ శశాంక అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ భవనాల్లో ఏమైనా ప్రభుత్వ పథకాలను సంబంధించిన ఫొటోలు, క్యాలెండర్లు, స్టిక్కర్లు ఉంటే తీసివేయాలన్నారు. కోడ్‌పై కిందిస్థాయి సిబ్బందికి కూడా అవగాహన కల్పించాలన్నారు. జెడ్పీ సీఈఓ రమాదేవి, ఆర్అండ్‌బీ ఈఈ తానేశ్వర్ పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

దృష్టి పెట్టాలి..
సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ శశాంక, ఎస్పీ చంద్రమోహన్‌తో కలిసి సెక్టోరియల్ అధికారులు, తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లను ప్రభావితం చేసే ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు.

మానుకోటలో పీవైఎల్ రాష్ట్ర మహాసభలు

- హాజరుకానున్న రాష్ట్ర, జిల్లా నాయకులు

నెహ్రూసెంటర్: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర 8వ మహాసభలు మానుకోట వేదికగా గురు, శుక్రవారం రెండురోజుల పాటు నిర్వహించనున్నారు. ఏర్పాట్లు పూర్తిచేయగా.. మొదటి రోజు బహిరంగసభ, రెండో రోజు ప్రతినిధుల సభ ఉంటుందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 300మంది ప్రతినిధులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. కాగా ప్రజాకవి జయరాజ్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి చిన్న చంద్రన్న, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, జస్టిస్ బి.చంద్రకుమార్ హాజరుకానున్నట్లు పీవైఎల్ నాయకులు తెలిపారు.

యువజనోద్యమంలో కీలక పాత్ర..
యువజనోద్యమంలో పీవైఎల్ క్రియాశీలక ప్రాతపోషించిందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్.ప్రదీప్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజాపంథా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మహాసభల్లో భాగంగా నేడు జిల్లా కేంద్రంలో ర్యాలీ, బహిరంగ సభ, రెండోరోజు ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. మహా సభల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుని ఉద్యమాలు నిర్వహించేలా ప్రణాళికలు చేపడుతామని పేర్కొన్నారు. పీవైఎల్ నాయకులుయాకయ్య, రంగయ్య, అనిల్ పాల్గొన్నారు.


మహాసభలకు ఫ్లకార్డులను సిద్ధం చేస్తున్న పీవైఎల్ నాయకులు

ఖైదీల విడుదలకు చర్యలు


మాట్లాడుతున్న జిల్లా ప్రిన్సిపల్ జడ్జి చంద్రశేఖరప్రసాద్

మహబూబాబాద్ రూరల్: జిల్లాలో ఎక్కువకాలం జైలులో ఉన్న అర్హులైన ఖైదీల కేసులు విచారించి విడుదలకు చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పి.చంద్రశేఖరప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టుల సముదాయంలో బుధవారం అండర్ ట్రయల్ ప్రిసనర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ ఏర్పాటు చేయగా.. చైర్మన్‌గా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పి.చంద్రశేఖరప్రసాద్, సభ్యులుగా కలెక్టర్ శశాంక, ఎస్పీ జి.చంద్రమోహన్, డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి సురేష్, సబ్ జైల్ సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాస్ నియామకమయ్యారు. అడిషనల్ ఎస్పీ చెన్నయ్య,డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్ ఉన్నారు.

పనితీరు బాగాలేదని..

- జిల్లా వ్యవసాయాధికారి రాష్ట్ర కార్యాలయానికి సరెండర్
- విధుల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ అగ్రహం
- నోటీస్‌లు ఇచ్చినా స్పందించని డీఏఓ

సాక్షి, మహబూబాబాద్: విధుల్లో నిర్లక్ష్యం, అధికారుల ఆదేశాల అమలులో అలసత్వం.. పనుల్లో జాప్యం.. వెరసి జిల్లా వ్యవసాయాధికారిపై వేటుపడింది.ఆయన పనితీరు బాగాలేదని భావించిన కలెక్టర్ శశాంక వ్యవసాయశాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ నాలుగు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో మానుకోట ఏడీఏ లక్ష్మీనారాయణను నియమించారు.

పర్యవేక్షణ లేదు..
డీఏఓ ఛత్రునాయక్‌పై వచ్చిన ఆరోపణలతో అధికారులు అసంతృప్తిగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. మొదటి నుంచి జిల్లాలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ షాపుల అనుమతుల్లో చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు వచ్చాయి. అదేవిధంగా షాపుల్లో ఫర్టిలైజర్ దిగుమతి, అమ్మకాల రిజిస్టర్ అమ్మకాలపై పర్యవేక్షణ లేకపోవడం, ఈ-పాస్ నిబంధనలపై ఉదాసీనతగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. క్షేత్రస్థాయి నుంచి ఏఈఓలు, ఏఓలు, ఏడీఏలపై పర్యవేక్షణ లేకపోవడంతో వారు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించి రైతులను ఇబ్బందులకు గురి చేసినట్లు పలువురిపై రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీటిపై వివరణ కోరుతూ.. పలు దఫాలుగా షోకాజ్ నోటీసులు ఇచ్చినా సకాలంలో స్పందించకపోవడంతో డీఏఓను సరెండర్ చేసినట్లు కలెక్టర్ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. కాగా డీఏఓను సరెండర్ చేయడంతో మిగతా అధికారుల్లో భయం మొదలైంది. డీఏఓతోనే ఈ చర్యలు ఆగవని, రెవెన్యూశాఖతో పాటు, ఇతర శాఖల్లో పనిచేస్తున్న పలువురు అధికారులపై కూడా వేటు పడే అవకాశం ఉందని తెలుస్తోంది.

క్లుప్తంగా

ముగిసిన కేయూ పాలక మండలి కాలపరిమితి!

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి (క్లాస్–2 ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లు) కాలపరిమితి బుధవారంతో ముగిసినట్లు సమాచారం. కేయూకు పాలక మండలి సభ్యులను ప్రభుత్వం 2019 అక్టోబర్ 12 నియమించింది. ఆ పాలకమండల పదవీ కాలం మూడు సంవత్సరాలు. 20 22 అక్టోబర్ 11వ తేదీ వరకు మూడేళ్లు పూర్తికాగా.. మళ్లీ ఆ గడువును అప్పట్లోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబర్ 11 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసిన విషయం విధితమే. అయితే ఈ పాలకమండలి కాలపరిమితి ముగిసినట్లేనా? లేదా కొత్తపాలక మండలిని నియమించే వరకు కొనసాగిస్తారా? లేదా అనే విషయం యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. కేయూ పాలకమండలి సభ్యులుగా కేయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సి పాల్ ఆచార్య పి మల్లారెడ్డి, హిస్టరీ విభాగం ఆచా ర్యుడు టి మనోహర్, ప్రభుత్వ పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి , డాక్టర్ గుండాల మదన్‌కుమార్, డాక్టర్ నాగేంద్రబాబు, డీపీఎస్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ జి రాజిరెడ్డి, ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్ బిజిఎన్‌ఆర్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ సీతారామారావు, ఇంగ్లిష్ విభాగం ఆచార్యుడు రాజేశ్వర్‌రావు, గణిత విభా గం ఆచార్యుడు సుమతిఉమామహేశ్వరి ఉన్నారు. ఇదిలా ఉండగా కేయూ పాలకమండలి సమావేశం నిర్వహించక నాలుగు నెలలు కావొస్తుంది.

పోలీస్ కస్టడీకి ఆర్‌ఐ అన్వేష్

రామన్నపేట : కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసి కోట్లాది రూపాయాల నిధుల దుర్వినియోగానికి పాల్పడిన మున్సిపల్ ఆర్‌ఐ అన్వేష్‌ను కోర్టు ఉత్తర్వుల మేరకు బుధవారం కస్టడీకి తీసుకున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు మూడు రోజులు అన్వేష్‌ను విచారించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంతో మాజీ సర్పంచ్ మృతి


మల్లారెడ్డి (ఫైల్)

లింగాలఘణపురం: విద్యుదాఘాతంతో మండలంలోని బండ్లగూడెం మాజీ సర్పంచ్ ముస్కు మల్లారెడ్డి (65) మృతి చెందారు. బుధవారం ఉదయం తన ఇంటిపై ఉన్న ట్యాంక్‌లోకి నీటిని పంప్ చేసేందుకు విద్యుత్ మోటార్‌ను ఆన్‌చేశాడు. అనంతరం సంపు చుట్టూ ఉన్న గడ్డిని చేతితో తొలగిస్తున్న క్రమంలో మోటార్‌ను పట్టుకోగా షాక్ సంభవించి కేకలు వేశారు. గమనించిన చుట్టు పక్కల వారు వెంటనే అపస్మారక స్థితికి చేరుకున్న మల్లారెడ్డిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, మల్లారెడ్డి.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీస్ హౌజింగ్ డిపార్ట్‌మెంట్‌లో అకౌంటెంట్‌గా ఉద్యోగ విరమణ పొంది 2014లో బండ్లగూడెం సర్పంచ్‌గా గెలుపొందారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మల్లారెడ్డి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

బీరువా మీదపడి విద్యార్థినికి తీవ్ర గాయాలు

వెంకటాపురం(కె): మండలంలోని ఆలుబాక ప్రాథమిక పాఠశాలలో బీరువా మీద పడడంతో మూడో తరగతి విద్యార్థిని మమతశ్రీకి తీవ్రగాయాలయ్యా యి. బుధవారం మధ్యాహ్న సమయంలో ఉపాధ్యాయురాలు తన పిల్లలను ఆడించేందుకు పాఠశాలలోని బీరువా, కిటికి తాడు కట్టి ఊయలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు పాపను ఊపుతున్నారు. ఈ క్రమంలో ఊయల కట్టిన బీరువా మమతశ్రీ మీద పడడంతో ఆ విద్యార్థినికి కాలు విరిగింది. దీంతో విద్యార్థినిని ఉపాధ్యాయులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి తరలించారు.

రహదారులు రక్తసిక్తం

అజాగ్రత్త.. అతివేగం.. నిర్లక్ష్యం కారణంగా రహదారులు రక్తసిక్తమయ్యాయి. మంగళ, బుధవారాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఈ ఘటనలపై ఆయా ప్రాంతాల పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రికి వెళ్లొస్తూ అనంతలోకాలకు..


మోతీ(ఫైల్)

బయ్యారం: అనారోగ్యానికి గురైన తల్లికి ఆస్పత్రిలో వైద్యం చేయించి ఇంటికి తీసుకొస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తల్లి మృతి చెందగా, కుమారుడి పరిస్థితి విషమంగా ఉంది. కురవి మండలం స్టేషన్ గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన ఇస్లావత్ మోతీ(75)కి జ్వరం రావడంతో సోమవారం సాయంత్రం కుమారుడు వీరన్న ద్విచక్రవాహనంపై జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆ రాత్రి అక్కడే ఉండి మంగళవారం ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బయ్యారం పెట్రోల్ బంక్ సమీపంలో వీరన్న ద్విచక్రవాహనాన్ని.. కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం మోతీని మహబూబాబాద్, వీరన్నను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. మోతీ బుధవారం మృతి చెందగా వీరన్న పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఉపేందర్ తెలిపారు.

అమీనాపురంలో రైతు..

కేసముద్రం: ఓ వ్యక్తి అజాగ్రత్తగా బైక్ నడపడంతో అదుపు తప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో బైక్ వెనక కూర్చున్న ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి మండలంలోని అమీనాపురంలో జరిగింది. మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన రైతు రామగిరి చంద్రయ్య(59) రెండురోజుల క్రితం మక్కలు విక్రయించేందుకు కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు చేరుకున్నాడు. తేమ ఉండడంతో యార్డులోనే ఆరబెట్టాడు. మంగళవారం తన మనువడి పుట్టిన రోజు కావడంతో ఇంటికి వెళ్లాడు. కాగా, మార్కెట్‌లో ఆరబెట్టిన మక్కలకు కాపలా ఉండేందుకు తిరిగి మంగళవారం రాత్రి గూడూరు మండలం అప్పరాజుపల్లి గ్రామానికి చెందిన నోముల ఉదయ్ బైక్‌పై కేసముద్రం బయలుదేరాడు. మార్గమధ్యలో


చంద్రయ్య(ఫైల్)

అమీనాపురం గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడడంతో వెనక కూర్చున్న చంద్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే చికిత్స నిమిత్తం మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా, ఉదయ్ అజాగ్రత్త, అతివేగంగా బైక్ నడపడం వల్లే తన తండ్రి కింద పడి మృతి చెందాడని మృతుడి కుమారుడు ప్రశాంత్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

వంగాలపల్లి సమీపంలో వ్యక్తి..


ఉపేందర్ (ఫైల్)

చిల్పూరు: మండలంలోని వంగాలపల్లి గ్రామ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ధర్మసాగర్ మండలం ధర్మాపురానికి చెందిన పబ్బోజు ఉపేందర్ (48) స్థానికంగా వడ్రంగి కులవృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. పని నిమిత్తం బుధవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై కరుణాపురం వెళ్లాడు. పని ముగించుకుని వెళ్తుండగా ఇద్దరు మిత్రులు కలిశారు. దీంతో ముగ్గురు ఒకే బైక్‌పై ధర్మపురం వెళ్తున్నారు. ఈ క్రమంలో వంగాలపల్లి రైల్వేగేట్ సమీపంలో ధర్మపురం నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న రంగనాయకుల శ్రీనివాస్‌రెడ్డిని ఢీకొన్నారు. ఈ ఘటనలో ఉపేందర్ అక్కడికక్కడే మృతిచెందగా, శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

కిష్టు తండాలో వ్యక్తి..

పెద్దవంగర: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పెద్దవంగర మండల కేంద్ర పరిధిలో జరిగింది. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని కిష్టు తండాకు చెందిన జాటోతు జేతిరాం (52) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజుమాదిరిగానే బుధవారం ఉదయం తన గేదెలను మేత నిమిత్తం పొలం వద్దకు తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి చేరుకుంటున్న క్రమంలో తొర్రూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కిష్టు తండా సమీపంలో జేతిరాంతోపాటు గేదెలను ఢీకొంది. దీంతో గేదెలు అక్కడికక్కడే మృత్యువాత పడగా తీవ్ర గాయాలపాలైన జేతిరాంను తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతిడికి భార్య భద్రమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.


జేతిరాం మృతదేహం

జూపార్క్ ఎదుట యువకుడు..

కాజీపేట అర్బన్ : హనుమకొండ హంటర్‌రోడ్డులోని జూపార్క్ ఎదుట డీసీఎం ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం జరిగింది. సుబేదారి పోలీసులు కథనం ప్రకారం వరంగల్ జిల్లా సంగెం మండలం లోహిత తండాకు చెందిన సపావత్ సుమన్(30) ద్విచక్ర వాహనంపై వరంగల్ నుంచి హనుమకొండ వైపునకు ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో జూపార్క్ ఎదుట డీసీఎం ఒక్కసారిగా క్రాస్ తీసుకుంటుండగా ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో సుమన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నెక్కొండలో వృద్ధురాలు..


పార్వతమ్మ (ఫైల్)

నెక్కొండ: ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయే క్రమంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మండల కేంద్రంలో జరిగింది. మండలంలోని కస్నా తండా జీపీకి చెందిన పలువురు రెండు ఆటోల్లో నెక్కొండ మీదుగా నర్సంపేటకు వెళ్తున్నారు. స్థానిక పీహెచ్‌సీ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పిస్తుండగా ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన పలువురికి తీవ్ర, స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా తీవ్ర గాయాలైన చెన్న పార్వతమ్మ (60) చికిత్స పొందుతు మృతి చెందారు. అలాగే, గారె సుజాతకు తీవ్రంగా, చెన్న లక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిలో సుజాత పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు సమాచారం. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు శ్రీను, ప్రభాకర్ ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ..

- రూ.12,500 నగదు, 10తులాల బంగారం అపహరణ
- గణేష్‌నగర్ కాలనీలో ఘటన

మామునూరు: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన వరంగల్ గవిచర్ల క్రాస్ సమీపంలోని గణేష్‌నగర్‌కాలనీలో జరిగింది. గణేష్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి కోటగిరి వీరయ్య, ఉమ దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారికి పెళ్లిలు కాగా.. కుమారుడు ప్రణయ్‌కుమార్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగ చేస్తూ అక్కడే స్థిరపడ్డాడు. ఈ క్రమంలో వీరయ్య, ఉమ దంపతులు ఈనెల 5న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని కుమారుడి ఇంటికి వెళ్లారు. గమనించిన దుండగుల తాళాలు పగుల కొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేసి రూ.12,500 నగదు, 10 తులాల బంగారం , 100 గ్రాముల వెండి, 12 పట్టు చీరలను అపహరించుకెళ్లారు. సమీప బంధువులు బుధవారం సాయంత్రం ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గుర్తించారు. అనంతరం తలుపు తెరిచిచూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో వెంటనే 100 డయల్‌కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మామునూరు పోలీసులు క్లూస్ టీమ్‌తో కలిసి ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా, చోరీ విషయం తెలిసిన వీరయ్య హుటాహుటినా హైదరాబాద్ నుంచి ఇంటికి చేరుకున్నారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.


చిందరవందరగా పడేసిన వస్తువులు

16 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ టెన్త్ , ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 16 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లు స్టడీసెంటర్లలో లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. తెలంగాణ ఓపెన్‌స్కూల్ ఓఆర్‌జీ వెబ్‌సైట్‌నుంచి పొందాలని హనుమకొండ జిల్లా డీఈవో అబ్దుల్‌హై, పరీక్షల సహాయ నిర్వహణ అధికారి చలపతిరావు, ఓపెన్ స్కూల్‌ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయన్నారు. టెన్త్‌లో 422 మంది, ఇంటర్‌లో 597 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని వారు తెలిపారు.

సీఎంఆర్..వస్త్ర ప్రపంచంలో రారాజు


అభిమానులకు అభివాదం చేస్తున్న సినీనటి రాశీఖన్నా

- చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్
- హనుమకొండలో షాపింగ్ మాల్ ప్రారంభం
- సినీనటి రాశీఖన్నా సందడి

నయీంనగర్: సీఎంఆర్ షాపింగ్ మాల్.. వస్త్ర ప్రపంచంలో రారాజు అని చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బుధవారం హనుమకొండలోని నయీంనగర్‌లో తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాల్ హనుమకొండలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి సంస్థలు ఏర్పాటు చేయడం వలన నగరం వాణిజ్యపరంగా అభివృద్ధి చెంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం సీఎంఆర్ ఫౌండర్ చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ ప్రపంచస్థాయి వస్త్ర సౌరభం సీఎంఆర్ అన్నారు. ఈ షాపింగ్ మాల్‌లో అన్ని వేడుకలకు వస్త్రాలు లభిస్తాయన్నారు. మార్కెట్‌లో ఎవరూ ఇవ్వని ధరలకు మగ్గాలపై నేయించిన వస్త్రాలు ఇక్కడ లభిస్తాయన్నారు. సీఎంఆర్‌ఎఫ్ ఎండీ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ తమ 26వ షోరూం హనుమకొండలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సీఎంఆర్ అంటే.. 'ది వన్ స్టాప్ షాప్' అని, ఫ్యామిలీలో అందరికీ నచ్చే డిజైన్స్ లభిస్తాయన్నారు. కాగా,సినీనటి రాశీఖన్నా షాపింగ్ మాల్‌లో సందడి చేశారు. మాల్ ప్రారంభోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నటుడు శివారెడ్డి మిమిక్రితో ఆహుతులను అలరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నం మధు, 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, అభిమానులు, వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న చీఫ్ విప్ దాస్యం, మేయర్ సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజ్

వాహన తనిఖీలు ముమ్మరం..


గార్ల : నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు


తొర్రూరు : పట్టణంలోని చెక్‌పోస్టు వద్ద..

- వివిధ చోట్ల ఆధారం లేకుండా తరలిస్తున్న నగదు స్వాధీనం

గార్ల: ఎన్నికల కోడ్ నేపథ్యంలో బుధవారం మండలంలోని సత్యనారాయణపురం క్రాస్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం రైటర్ బస్తీకి చెందిన కె శంకర్ ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.83,900 నగదును స్వాధీనం చేసుకున్నారు. రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్తే ఆధారాలు చూపించాలని గార్ల బయ్యారం సీఐ కె బాబూరావు, ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు.

తొర్రూరులో రూ.8 లక్షలు..

తొర్రూరు: పట్టణంలోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కారులో రూ.5 లక్షలు, బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద రూ.3 లక్షలు లభ్యమయ్యాయి. ఆ మొత్తానికి సంబంధించి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నామని ఎస్సై జగదీష్ తెలిపారు.

వర్ధన్నపేటలో రూ.72 వేలు..

వర్ధన్నపేట: వర్ధన్నపేట పట్టణ పరిధిలోని ఆల్ఫోర్స్ ఉన్నత పాఠశాల సమీపంలో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలో ఓ కారులో రూ.72వేల నగదు పట్టుబడింది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామానికి చెందిన షేక్ అన్వర్ కారులో వరంగల్ వెళ్లి తిరిగి సూర్యాపేటకు వెళుతుండగా అతనినుంచి ఈ నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఎంజీఎం జంక్షన్‌లో రూ. 2 లక్షలు..

రామన్నపేట : వరంగల్ ఎంజీఎం జంక్షన్‌లో బుధవారం సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో ఎలాంటి ఆధారం లేకుండా తరలిస్తున్న రూ. 2 లక్షల నగుదును స్వాధీనం చేసుకున్నామని మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పరకాలకు చెందిన నిస్పాని సత్యనారాయణ వద్ద నుంచి 1.50 లక్షలు, మహాముత్తారానికి చెందిన బానోతు నర్సింహ వద్ద నుంచి రూ. 55 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

మిరపలో వైరస్ తెగుళ్లు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

- సిఫార్సు లేని మందులు వాడొద్దు
- మల్యాల కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మాలతి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ రాంబాబు

మహబూబాబాద్ రూరల్ : మిరప పంటలో ప్రస్తుతం రైతులను ఆందోళనకు గురిచేస్తున్న జెమిని వైరస్, బొబ్బ రోగంపై జాగ్రత్తగా ఉండాలని, పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని మహబూబాబాద్ మండల మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఇ.రాంబాలు రైతులకు సూచనలు చేశారు. మిరప పంటను ప్రధాన పొలంలో నాటి నెల, నెలన్నర రోజులు గడవకముందే చిన్న మొక్కలపై రైతులు పోటా పోటీగా పురుగుల మందులు, సిఫార్సు లేని బయోమందులను పిచికారీ చేస్తూ పెట్టుబడి పెంచుకునే పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఆగస్టులో ఉన్న పొడి వాతావరణం పరిస్థితుల్లో వేసుకున్న మిరప పంటలో ప్రస్తుతం వివిధ చీడ, పీడలు ఆశించి రైతులకు లేని నిరాశను కల్గిస్తుంది.

పైముడత నివారణకు :

ఫిప్రోనిల్ 5 శాతం ఎస్.సి 2 మిల్లీ లీటర్లను లీటరు నీటికి లేదా డైఫెన్ థయురాన్ 50 శాతం 1.5 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


కింది ముడత నివారణకు :

నీటిలో కరిగే గంధకం 80 శాతం 3 గ్రాములను లీటరు నీటికి లేదా స్పైరోమెసిఫెన్ 0.8 మిల్లీ లీటర్లను లీటరు నీటికి లేదా ప్రాపర్ గైట్ 57 శాతం. 2 మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

లద్దె పురుగు నివారణకు :

నోవాల్యూరన్ 0.75 మిల్లీ లీటర్లను లీటరు నీటికి లేదా స్పైనోసాడ్ 0.25 మిల్లీ లీటర్లను లీటరు నీటికి లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములను లీటరు నీటికి లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


పైముడత సోకిన మిరప మొక్క


కింది ముడత సోకినా మొక్క


లద్దె పురుగు సోకిన మొక్క


మొక్కకు సోకిన జెమిని వైరస్

జెమిని మోజాయిక్ వైరస్ (గుబ్బ) నివారణకు..

- ఇది తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. వైరస్ నివారణకు ప్రత్యేకంగా ఎలాంటి మందులు లేవు.. కనుక సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి.
- తొలిదశలోనే వైరస్ సోకిన మొక్కలను ఎప్పటికప్పుడు పీకి కాల్చివేయాలి. ప్రధాన పొలంలో, గట్లపైన కలుపు మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త తీసుకోవాలి. కొన్ని రకాల కలుపు మొక్కలు వైరస్ తెగుళ్లకు ఆశ్రయం కల్పిస్తాయి. మిరప పంటలో వంగ, టమాట మొక్కలను ఎట్టి పరిస్థితుల్లోను పెంచరాదు. ఇవి తెల్ల దోమలకు ఆశ్రయం కల్పిస్తాయి.
- పొలం చుట్టూ 2 నుంచి 3 వరుసల సజ్జ, జొన్న లేదా మొక్కజొన్న రక్షణ పంటలుగా వేసుకోవాలి.
- పసుపు రంగు, నీలం రంగు జిగురు అట్టాలను 20 నుంచి 25 చొప్పున ఎకరానికి రైతులు సాముహికంగా వేసుకోవాలి.
- మొక్కల ఎత్తుని బట్టి జిగురు అట్టాలను కూడా పైకి అమర్చుకోవాలి.
- తెల్ల దోమల నివారణకు 5 శాతం వేప గింజల కషాయం (వేపనూనె 1500 పీపీఎం 5 మిల్లీలీటర్లను లీటరు నీటికి (లేదా) పైరిప్రాక్సిఫెన్ 102 ఇ.సి. 1.5 మిల్లీ లీటర్లను లీటరు నీటికి లేదా ఫెరిప్రాక్సిఫెన్ 57. ఇ.సి. + ఫెన్‌పోపాత్రిన్ 15 ఇ.సి. 1 మిల్లీ లీటరును లీటరు నీటికి (లేదా) ఫెనో పాత్రిన్ 30 శాతం ఇ.సి 0.5 మిల్లీలీటర్లను లీటరు నీటికి లేదా థయామిథాక్సాం 0.4 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ప్రతిసారీ రైతులు పురుగుమందును పిచికారీ చేసినప్పుడు కేవలం పురుగు మందును మాత్రమే కాకుండా పోషకాల మిశ్రమం (191919/13045) లేదా సూక్ష్మ పోషకాల మిశ్రమం 5 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే మొ క్కలకు బలాన్ని ఇస్తూ, వ్యాధి నిరోధక శక్తి పెరిగి కొత్త రకా ల చీడ, పీడలను తట్టుకొని నిలబడే అవకాశం ఉంటుంది.

బాలికలకు సమాన అవకాశాలు కల్పించాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఉపేందర్‌రావు

న్యూశాయంపేట : బాలికలు అన్ని రంగాల్లో రాణించడానికి తల్లిదండ్రులు బాలురతోపాటు సమాన అవకాశాలు కల్పించాలని వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఉపేందర్‌రావు సూచించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ, అభ్యుదయ సేవా సమితి వరంగల్ అధ్వర్యంలో దూపకుంట రోడ్డులోని మైనార్టీ బాలికల గురుకులం–2లో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నీలిమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపేందర్‌రావు ప్రసంగించారు. ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను విద్యార్థినులు అందిపుచ్చుకోవాలని సూచించారు. బాలికలపై జరుగుతున్న దాడులను ముక్తకంఠంతో ఖండించాలని, విద్యార్థినులు సన్మార్గంలో నడవాలని కోరారు. అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు మండల పరశురాములు, జిల్లా ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్ అనిల్‌కుమార్, గురుకులం అకడమిక్ కోఆర్డినేటర్ ఆఫ్రీన్ సుల్తానా, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.